క్లుప్తంగా

నేడు రక్తదాన శిబిరం

తిర్యాణి: వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని చెలిమల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యుడు కృష్ణ తెలిపారు. మండలంలోని రక్తదాతలు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలన్నారు.

ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీకి దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: ఇంటర్ పూర్తయిన విద్యార్థుల నుంచి ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దివ్యరాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కెమిస్ట్రీ విభాగంలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత



బాధితుడికి ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై

దహెగాం: మండలంలోని హత్తిని గ్రామానికి చెందిన బండ రవీందర్ ఈనెల 11న తన ఫోన్ పోగొట్టుకోగా, అదేరోజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి పోగొట్టుకున్న ఫోన్‌ను గుర్తించి ఆదివారం బాధితుడికి అందజేశారు. ఎస్సై సనత్‌కుమార్ మాట్లాడుతూ ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

వ్యాపారంలోనూ సేవా దృక్పథం కలిగి ఉండాలి


ప్రారంభోత్సవంలో పాల్గొన్న రమాదేవి

కాగజ్‌నగర్‌టౌన్: వ్యాపారంలోనూ సేవా దృక్పథం కలిగి ఉండాలని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సతీమణి కోనేరు రమాదేవి అన్నారు. ఆదివారం స్థానిక పెట్రోల్ పంపు ఏరియాలోని శ్రీషైన్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొని ఆమె మాట్లాడారు. వివిధ రుగ్మతలతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు వి.వి.ప్రసాద్, ఆసుపత్రి నిర్వాహకుడు రాహుల్, వైద్యురాలు నవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

కౌటాల: మండల కేంద్రంలోని వాహిని స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, వెంకటేశ్వర కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్‌ఎం దుర్గం మారుతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వాహిని పాఠశాల ఆవరణలో శిబిరం నిర్వహిస్తామన్నారు. వివరాలకు 8885100716 నంబర్‌పై సంప్రదించాలని సూచించారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్
కుమురంభీం : జైలర్
కాగజ్‌నగర్
వెంకటరమణ : జైలర్
- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.50
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	80
కాకరకాయ	80
బెండకాయ	60
అలసంద	60
దొండకాయ	100
పచ్చిమిర్చి	100
పాలకూర	60
సోరకాయ	60
చిక్కుడు కాయ	80
గోబి(పూల్)	100
క్యాబేజి	60

-ఆసిఫాబాద్‌అర్బన్

ఆలస్యంగా వరినాట్లు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలో వరినాట్లు ఆలస్యంగా మొదలయ్యాయి. ఈ ఏడాది జూన్‌లో వానలు లేకపోవడంతో ప్రాజెక్టులు, చెరువుల్లో నీరు లేక రైతులు వరినారు మడులు ఆలస్యంగా వేశారు. దీంతో ఏటా జూలై చివరి వారంలో వేసే వరినాట్లు ఈ ఏడాది ఆగస్టు చివరి వారంలో వేస్తున్నారు. ఆదివారం వరినాట్లు వేస్తూ రైతులు పొలాల్లో బిజీగా కన్పించారు.


వరినాట్లు వేస్తున్న మహిళలు


నారు తీసుకెళ్తున్న రైతు


పొలాన్ని ట్రాక్టర్‌తో చదును చేస్తున్న రైతు

సమస్యల్లో 'రీట్‌గూడ'

- సరైన రహదారి లేదు
- భగీరథ జలం నామమాత్రమే
- పట్టించుకోని అధికారులు


రీట్‌గూడ ప్రధాన రహదారి

వాంకిడి: మండలంలోని చిచ్చుపల్లి గ్రామపంచాయతీ పరిధి రీట్‌గూడ గ్రామం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. గ్రామంలో విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి, అంతర్గత రహదారులు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన రహదారులు లేకపోవడంతో విద్య, వైద్యానికి దూరమవ్వాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో కనీస సౌకర్యాలు కల్పించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నారు.

రహదారి నిర్మాణంలో జాప్యం..

చౌపన్‌గూడ వెళ్లే రహదారి నుంచి చిన్న పుల్లార మీదుగా రీట్‌గూడ, చీచ్‌పల్లి గ్రామం వరకు 2022 నవంబర్‌లో ఐటీడీఏ ఆధ్వర్యంలో బీటీ రోడ్డు మంజూరు చేశారు. ఈ రహదారి 4 కిలోమీటర్లు నిర్మించాల్సి ఉండగా ఇందుకు రూ. 1.86 కోట్లు విడుదల చేశారు. కానీ అధికారుల నిర్లక్ష్యంతో నేటికీ రహదారి నిర్మాణం ప్రారంభానికి నోచుకోలేదు. వర్షాకాలంలో చిన్నపుల్లార గ్రామం నుంచి చిచ్చుపల్లి వరకు గల రహదారి చిత్తడిగా మారి అత్యవసర సమయాల్లో బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. రోడ్డుపై ఉన్న ఒర్రెల్లో వరద ప్రవాహం పెరిగిన ప్రతీసారి గ్రామానికి బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి.

అనేక సమస్యలు..

రీట్‌గూడ గ్రామం చిన్నపుల్లార, చిచ్చుపల్లి గ్రామాల మధ్యలో ఉంటుంది. చిచ్చుపల్లి గ్రామం సవాతి రహదారికి సమీపంలో, చిన్న పుల్లార చౌపన్‌గూడ రహదారికి సమీపంలో ఉన్నాయి. కాగా రీట్‌గూడ గ్రామస్తులు బీటీ రహదారికి చేరుకోవాలంటే ఎటు వెళ్లినా 2 కిలోమీటర్లు కాలి నడకన వెళ్లాల్సి ఉంటుంది. వర్షాకాలంలో మట్టిరోడ్డు చిత్తడిగా మారుతుండటంతో పాటు ఉప్పొంగి ప్రవహించే ఒర్రెలు మరో సమస్యగా మారాయి. సరైన రహదారి లేక అత్యవసర సమయాల్లో అనేక అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో భగీరథ నీటి ట్యాంకు, నల్లాలు ఉన్నా అవి అలంకార ప్రాయంగా మారాయి. తాగునీటి కోసం బోరింగ్ ఉన్నా పాడైనప్పుడు ఒర్రె నీటినే తాగాల్సిన పరిస్థితి ఉంది. గ్రామంలో విద్యుత్ లైన్, స్తంభాలు ఉన్నప్పటికీ విద్యుత్ దీపాలు మాత్రం కానరావు. గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు నిర్మించాలి



వర్షాకాలంలో మట్టిరోడ్డుతో అనేక తిప్పలు పడుతున్నాం. గ్రామ సమీపంలోని రోడ్డుపై గల ఒర్రెలో భారీగా బురద వచ్చి చేరడంతో ప్రతీ ఇంటికి చందాలు వేసుకుని బండలు వేసుకున్నాం. వ్యవసాయ పనులకు వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. బీటీ రోడ్డుతో పాటు ఒర్రెలపై వంతెనలు నిర్మించాలి.

- అడ జంగుబాయి, రీట్‌గూడ

పట్టించుకునే వారు లేరు



గ్రామంలో అనేక సమస్యలు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మా గూడెం సమస్యలను గ్రామ పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోతోంది. ఇప్పటికైనా అధికారులు మా గ్రామం వైపు దృష్టి సారించాలి.

- మడావి మల్కు, గ్రామ పటేల్, రీట్‌గూడ

'గృహలక్ష్మి'కి వేళాయే..!


ముత్తంపేట్‌లో క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న పంచాయతీ సిబ్బంది

- అర్హులను తేల్చే పనిలో అధికారులు
- మళ్లీ వివరాలు నమోదు చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు
- మండలంలో 3వేల దరఖాస్తులు

కౌటాల: సొంత స్థలాలున్న పేదలు పక్కా ఇళ్ల నిర్మించుకునేందుకు ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రస్తుతం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే భారీగా దరఖాస్తులు రాగా.. మరి కొందరు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకునే పనిలో ఉన్నారు. గ్రామాల్లో పంచాయతీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. గృహలక్ష్మి పథకంలో భాగంగా ప్రతీ నియోజకవర్గానికి రాష్ట్ర ప్రభుత్వం 3000 గృహాలను మంజూరు చేసినట్లు ప్రకటించారు. మండల వ్యాప్తంగా ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన

మండలంలోని 20 గ్రామ పంచాయతీల నుంచి సుమారు 3వేల మందికి పైగా గృహలక్ష్మి దరఖాస్తులు చేసుకున్నారు. మండలానికి చెందిన కొంతమంది దరఖాస్తుదారులు కలెక్టర్ కార్యాలయంలో సైతం దరఖాస్తులు చేసుకోవడంతో అక్కడి నుంచి మండలానికి తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో గృహలక్ష్మి దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. గ్రామాల వారీగా పంచాయతీ అధికారులు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు.

కొత్త దరఖాస్తు ఫారం..

గృహలక్ష్మి పథకానికి మీ సేవా, జిరాక్స్ కేంద్రాల్లో నుంచి దరఖాస్తుపత్రాలు తీసుకుని వివరాలు నమోదు చేసి దరఖాస్తుదారులు ఎంపీడీవో కార్యాలయాల్లో అందజేశారు. కాగా ఇటీవల ప్రభుత్వం సీఎం కేసీఆర్ ఫొటోతో కూడిన కొత్త దరఖాస్తుపత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అందించి దరఖాస్తుదారుల వివరాలు కొత్త ఫారంలో నమోదు చేయాలని ఆదేశించింది. దీంతో పంచాయతీ కార్యదర్శులు దరఖాస్తుదారులకు ఫోన్లు చేసి జీపీ కార్యాలయాలకు పిలిచి సంతకాలతో పాటు వివరాలు నమోదు చేస్తున్నారు. కొంతమంది దరఖాస్తుదారులకు పంచాయతీ కార్యదర్శుల నుంచి ఫోన్లు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కాగా పంచాయతీ కార్యదర్శులు కొత్త ఫారాలను స్వయంగా జిరాక్స్‌లు తీసి వివరాలు నమోదు చేసి స్థానిక ఎంపీవో, తహసీల్దార్‌ల వద్ద సంతకాలు చేయిస్తున్నారు. దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని ప్రభుత్వం ప్రకటించినా క్షేత్రస్థాయిలో అధికారులు దరఖాస్తులను స్వీకరించడం లేదనే ఆరోపణలున్నాయి.


గృహలక్ష్మి పథకం క్రింద ఇల్లు మంజూరు కోసం దరఖాస్తు
Application for sanction of house under Gruhalakshmi Scheme

సీఎం కేసీఆర్ ఫొటోతో గృహలక్ష్మి కొత్త ఫారం

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

నార్నూర్: మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియా గాంధీ చౌక్ వద్ద భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ ఆశయ సాధన కోసం ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లోఖండే దేవురావు, యసుఫ్‌ఖాన్, కైలాస్ జాదవ్, కరీంఖాన్, షేక్ సత్తార్, జాకురుల్లా ఖాన్, అడే ప్రకాష్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లెక్చరర్ల సంఘం నాయకులు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే జోగు రామన్న నివాసంలో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పట్టణం నుంచి 40 కిలో మీటర్ల దూరంలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో జైనథ్, బేల మండలాల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కళాశాల ఏర్పాటుతో పేద విద్యార్థులకు దూరభారం తగ్గుతుందన్నారు.

రెండో టెట్ నమూనా పరీక్షకు విశేష స్పందన


టెట్ నమూనా పరీక్ష పత్రాలు విడుదల చేస్తున్న నిర్వాహకులు

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన టెట్ నమూనా పరీక్షకు విశేష స్పందన లభించింది. ముందుగా టెట్ నమూనా పరీక్ష పత్రాలను ట్రస్ట్ నిర్వాహకులు విడుదల చేశారు.

అమ్మవారి సన్నిధిలో భక్తుల పూజలు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని భక్తులతో పాటు ఇతర మండలాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, ఓడి బియ్యం, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మోడెం తిరుపతి గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వృద్ధురాలికి యువకుడి ఆసరా

లింగాపూర్: ఉండడానికి సరైన ఇల్లు కూడా లేక ఇబ్బంది పడుతూ ఒంటరి జీవనం సాగిస్తున్న మండల కేంద్రానికి చెందిన 70ఏళ్ల వృద్ధురాలు అడే మంగిబాయికి అదే గ్రామానికి చెందిన యువకుడు జాటోత్ రాహుల్ ఆసరానందించాడు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి మంగిబాయి కట్టెల ఇంట్లోకి వర్షపు నీరు భారీగా చేరగా ఎన్నో అవస్థలు పడుతోంది. ఇంట్లో ఉండలేక గ్రామంలోనే ఆరుబయట తలదాచుకుంటుంది. వృద్ధురాలి పరిస్థితిని గమనించిన రాహుల్ తన సొంత నిధులతో ఇంటికి మరమ్మతులు చేపట్టాడు. మానవత దృక్పథంతో స్పందించి ముందుకొచ్చిన యువకుడిని గ్రామస్తులు అభినందించారు.


మరమ్మతు చేయిస్తున్న యువకుడు రాహుల్

జానపద దినోత్సవ సభ విజయవంతం చేయాలి

జైనూర్: మార్లావాయి గ్రామంలో ఆగస్టు 22న ప్రపంచ జానపద దినోత్సవ సభను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం గ్రామస్తులు, అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రపంచ జానపద దినోత్సవ సభను ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలు అద్దం పట్టేలా నిర్వహించాలన్నారు. గ్రామ పటేల్ ఆత్రం హన్మంతరావు, గ్రామ దేవారి కనక గణపత్‌రావు, మాజీ సర్పంచ్ కనక కోద్దు, హైమన్ డార్ఫ్ యూత్ సభ్యులు సుదర్శన్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న కనక ప్రతిభ వెంకటేశ్వర్‌రావు

పేపర్‌మిల్లు కార్మికులకు న్యాయం చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లు యాజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతోందని, కార్మికులకు న్యాయం చేయాలని బీఎస్పీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడం గణపతితో కలిసి ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రతీ కాంట్రాక్టు కార్మికుడికి రూ.35వేలు చెల్లిస్తామని ఇచ్చిన హామీ అమలు కావడం లేదన్నారు. వడ్డీ కలిపి సెప్టెంబరు 5వ తేదీలోగా చెల్లించకుంటే బీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు ముక్తార్ శబ్బీఖాన్, అహ్మద్ పాషా పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఉల్లాసంగా...ఉత్సాహంగా



కుమురంభీమ్ ప్రాజెక్టు వద్ద ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువతీ యువకులు అధికసంఖ్యలో జలాశయాన్ని సందర్శించారు. యువత కుటుంబ సభ్యులతో బోటింగ్ చేస్తూ ఉల్లాసంగా గడిపారు. - ఆసిఫాబాద్

'రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి'

ఆసిఫాబాద్‌అర్బన్: రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోకేశ్, ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట రెండో ఏఎన్‌ఎంలు చేపట్టిన సమ్మె ఆదివారం ఐదోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మెకు మద్దతు ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో, రాష్ట్రానికి అవార్డులు తీసుకరావడంలో, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఏఎన్‌ఎంల పాత్ర అత్యంత కీలకమైందని, అలాంటి వారిపట్ల సీఎం కేసీఆర్ నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా కింద రూ.50 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం కాలయాపన చేయకుండా వెంటనే ఏఎన్‌ఎంల డిమాండ్లు నెరవేర్చాలని లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అంబాల ఓదెలు, రాజేందర్, లింగయ్య, మధుకర్, శుభ్రం, మునీశ్వర్, ప్రకాష్, శ్రీకాంత్, రాజు, ఈశ్వర్, గోకుల్, రమేశ్, నగేష్, అనీల్, గౌతమ్, భీమ్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.


దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

వివాహిత ఆత్మహత్య

జైనూర్: మండలంలోని రాసిమెట్ట గ్రామానికి చెందిన తాంబారే కవిత(19) అనే వివాహిత ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కవిత ఆదివారం ఉదయం భర్త అశోక్‌తో గొడవ పడింది. ఈక్రమంలో మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి ఉట్నూర్ ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త వేధింపులతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తల్లి రేణుకబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త అశోక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు.